క్లుప్తంగా

వేంకటేశ్వరుడి కల్యాణోత్సవాలు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని కమాన్‌బజార్ శ్రీ స్తంభాద్రి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి 61వ వార్షిక కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బిందె తీర్థం, ప్రాతరారాధన, బలిప్రధానం, ఎదుర్కోలు, తిరుకల్యాణం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొండకింది వేణుగోపాలచార్యులు పర్యవేక్షణలో ది ఖమ్మం ఐరన్ హార్డ్‌వేర్ అండ్ స్టీల్ మర్చంట్స్ అసోసియేషన్ సహకారంతో కల్యాణమహోత్సవాలను నిర్వహిస్తున్నారు.

రాజకీయాలకు దూరంగా ఉండండి

నేలకొండపల్లి: ఎన్నికల సమయాన ప్రతీ అధికారి రాజకీయాలకు దూరంగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి కె.రవిబాబు సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఏ రాజకీయ పార్టీ నాయకులతో మాట్లాడొద్దని, ఎవరి నామినేషన్లు రాయొద్దని, ఎన్నికల ఖర్చు పొదుపుగా వాడాలని సూచించారు. ఎన్నికలను సమన్వయంతో విజయవంతంగా పూర్తి చేయాలని, కోడ్‌ను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎంయర్రయ్య, మండల పంచాయతీ అధికారి శివ, ఏఓ ఎం.రాధ, రిసోర్స్ పర్సన్ పెద్ది జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీవోస్ బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవోస్) జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కొంగర వెంకటేశ్వర్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని సంఘం బాధ్యులతో కలిసి మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం బాధ్యులు పలు సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, నాయకులు మల్లెల రవీంద్రప్రసాద్, విజయ్‌కుమార్, భాస్కర్ రావు, హరీష్, రాకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి



ఎస్ఈకి మొక్క అందిస్తున్న దృశ్యం

ఖమ్మంవ్యవసాయం: ట్రాన్స్‌కో సంస్థలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ 1104 ప్రాంతీయ కార్యవర్గ డిస్కం ప్రతినిధులు ఎస్ఈ వి.రాంబాబును అభ్యర్థించారు. ఖమ్మం ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఎస్ఈగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాంబాబును మంగళవారం 1104 ప్రతినిధి తక్కెళ్లపల్లి శేషగిరిరావు ఆధ్వర్యాన ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీబీడీ గ్యాంగ్ విధుల నిర్వహణకు వాహనాన్ని ఏర్పాటు చేయాలని, జేఎల్ఎం నుంచి ఏఎల్ఎం పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.ఉషారాణి, కార్యదర్శి టి.రవికుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.శరణ్‌కుమార్, అదనపు కార్యదర్శి ఆదినారాయణ, గోపిచంద్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మం అర్బన్: నగరంలోని మమత విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ మైసమ్మ గుడి ఫీడర్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా నేడు(బుధవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్-2 ఏడీ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు లకారం ట్యాంక్‌బండ్, నేషనల్ హైవే ఆఫీస్, మమత ఆస్పత్రి రోడ్డు, రాఘవయ్యనగర్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: గత నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ టీచర్ల వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యాసంస్థలు ప్రారంభం కాగానే గురుకులాలు తెరుచుకోవాలి కానీ జీతాలు రాలేదని ఉపాధ్యాయులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గురుకులాల్లో ప్రభుత్వ పోస్టులు భర్తీ చేయలేదని, ఆధార్ అప్‌డేట్ పేరుతో డైట్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయకుండా తాత్సారం చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో విద్యారంగంలో బకాయిలు, ఫీజులు, అంతా గందరగోళంగా ఉందని, ఇకనైనా ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, నగర నాయకులు త్రినాథ్, లోకేష్, మనోజ్, రమణ, అభి, సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

భద్రత.. తూచ్!

పెద్దాస్పత్రిలో పనిచేయని సీసీ కెమెరాలు

- చోరీకి గురవుతున్న బైక్‌లు
- సమయపాలనపై పట్టింపు కరువు
- పరిష్కారానికి నోచుకోని ఫిర్యాదులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వాహనాలకు భద్రత కరువైంది. ఎప్పుడు ఏ వాహనం ఎలా చోరీకి గురవుతుందో అర్థం కాని పరిస్థితులు ఉన్నాయి. ముఖ్యంగా ద్విచక్రవాహనాలు ఎక్కువగా మాయమవుతుండగా.. వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం వైద్య సేవల కోసం పలువురు పెద్దాస్పత్రికి వస్తుండగా.. అందులో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారు ఎక్కువగా ద్విచక్ర వాహనాలపై వస్తుంటారు. అంతేకాక పేషంట్లతో పాటు ఉద్యోగులు, ఇతర పనుల కోసం వచ్చే వారి వాహనాలతో ఆస్పత్రి ఆవరణమంతా కిక్కిరిసిపోతోంది. ఆస్పత్రి వెనుక ప్రత్యేక పార్కింగ్ సౌకర్యం ఉన్నా.. దాన్ని ఎవ్వరూ వినియోగించక ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో దొంగలకు మంచి చాన్స్ దొరికినట్లవుతోంది.

తరచూ దొంగతనాలు..

పెద్దాస్పత్రిలో సీసీ కెమెరాల నిర్వహణ అధ్వానంగా ఉంది. చాలా రోజులుగా సీసీలు పనిచేయకపోవడంతో ఆస్పత్రికి ఎవరు వచ్చిపోతున్నారో తెలియని పరిస్థితి ఉంది. తరచూ వేలాది మంది వచ్చిపోయే ఆస్పత్రిలో ఏ సంఘటన జరిగినా సీసీ కెమెరాలదే ముఖ్యపాత్ర అయినా అవి పనిచేయక పోవడంతో తరచూ వాహన చోరీలు జరుగుతున్నాయి. దీంతో సంబంధిత బాధ్యులను గుర్తించలేకపోతున్నారు. పెద్దాస్పత్రిలో మొత్తం 51 సీసీ కెమెరాలు ఉండగా.. జనరల్ ఆస్పత్రిలో 35, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో 16 సీసీలు ఉన్నా.. 8 మాత్రమే పనిచేస్తున్నాయి. కీలకమైన ప్రాంతాల్లోని సీసీ కెమెరాలు చాలా రోజులుగా పనిచేయడం లేదు. కొన్నిచోట్ల కెమెరాలు పగిలిపోగా, మరికొన్ని చోట్ల కేబుల్స్ దెబ్బతిని పనిచేయట్లేదు. అయినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో ఆస్పత్రి లోపల, బయట పరిసరాల్లో ఏం జరుగుతుందో తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది.

పర్యవేక్షణ కరువు..

సీసీ కెమెరాలు పనిచేయకపోవడం కొందరు వైద్యులు, సిబ్బందికి వరంలా మారింది. ఎవరూ ఎప్పుడు వచ్చి వెళ్తున్నారో అర్థం కాని పరిస్థితులు ఉన్నాయి. ఆస్పత్రిలోని సీసీ కెమెరాలు సూపరింటెండెంట్ చాంబర్‌కు అనుసంధానించినా కానీ అవి పనిచేయకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. దొంగతనాలు జరిగినప్పుడు వాటిని గుర్తించలేకపోతున్నారు. అలాగే ఓపీ, ఇన్‌పేషంట్ వార్డుల్లో వైద్యులు, సిబ్బంది ఏం చేస్తున్నారో గమనించే వీలు లేకుండా పోయింది.

అస్తవ్యస్తంగా పార్కింగ్..

పెద్దాస్పత్రిలో వాహనాలకు రక్షణ లేకుండా పోయింది. ప్రత్యేక పార్కింగ్ వినియోగించుకోకుండా ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపుతున్నారు. ఇదే అనువుగా భావించిన కొందరు దొంగలు వాహనదారులపై ప్రత్యేక నిఘా పెట్టి వాహనాలు చోరీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలోకి వెళ్లగానే అది గమనిస్తూ చోరీ చేస్తున్నారు. ఇటీవల 7 వాహనాలు చోరీకి గురి కాగా మెడికల్ సూపరింటెండెంట్‌కి బాధితులు ఫిర్యాదు చేశారు. అంతే కాక ఈ మధ్య కాలంలో ఇన్‌పేషంట్ వద్ద కూడా డబ్బులు, బంగారం చోరీకి గురవడంతో ఫిర్యాదులు అందాయి. ఈ ఏడాది పదుల సంఖ్యలో వాహనాలు చోరీ అయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికారులు ఫిర్యాదు తీసుకోవడానికి మాత్రమే పరిమితమవుతున్నారే కానీ శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తాం..



ఆస్పత్రిలో కొన్ని చోట్ల సీసీ కెమెరాలు పనిచేయట్లేదనే విషయాన్ని గుర్తించాం. ఇకపై ఆస్పత్రిలో చోరీలు జరగకుండా చూస్తాం. సీసీ కెమెరాలు రిపేర్ చేయించి ప్రధానమైన చోట్ల నూతనంగా మరికొన్ని ఏర్పాటు చేయిస్తాం. వాహనాలు ఎక్కడ పడితే అక్కడ నిలపకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. వాహనదారులు కూడా తమ వాహనాల పట్ల జాగ్రత్త వహించాలి. – **ఎం.నరేందర్, ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్**

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య పేర్కొన్నారు. మంగళవారం పెద్దాస్పత్రి పరిసరాల్లో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించిన ఆయన పార్కింగ్ నిర్వహణ తీరును సమీక్షించారు. అనంతరం సూపరింటెండెంట్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించి ఆస్పత్రిలో అవసరమైన ఏర్పాట్లపై చర్చించి కార్పొరేషన్ నిధుల ద్వారా పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దాస్పత్రిలో మరుగుదొడ్ల నిర్మాణం, అంతర్గత రహదారుల సదునుచేయడం, తాగునీటి ఏర్పాట్లు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఓపీ రిజిస్ట్రేషన్ కోసం కియాస్కో మిషన్లు ఇప్పిస్తామని, సీసీ కెమెరాల ఏర్పాటు చేయిస్తాన్నారు. వాహనాల పార్కింగ్‌పై స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఆస్పత్రి పరిసరాల్లో మొక్కలు నాటాలని హార్టికల్చర్ ఆఫీసర్‌కు ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి శానిటేషన్ ప్లాన్ తయారు చేసి, దాని ప్రకారం క్రమబద్ధంగా పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ ఎం.నరేందర్, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.



పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ అగస్త్య

సంతకాల సేకరణ ముమ్మరం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గాప్రసాద్

ఖమ్మంమయూరిసెంటర్: ఓట్ల చోరీపై సంతకాల సేకరణను ముమ్మరం చేయాలని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ కాంగ్రెస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, ఎన్నికల సంఘం కుమ్మక్కుపై ప్రజలకు వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టాలన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు కుట్ర పన్నడమే బీజేపీ పని అని, ఎన్నికల కమిషన్ తనకున్న రాజ్యాంగ ప్రతిపత్తిని దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ జావేద్, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యర్రం బాలగంగాధర్ తిలక్, బోజెడ్ల సతీష్, దగ్గుల రఘుపతిరెడ్డి, చావ వేణు, కందిమల్ల వీరబాబు, వేముల కష్ణప్రసాద్, వడ్డే నారాయణరావు, కళ్యం వెంకటరెడ్డి, భూక్యా బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు..



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: రాష్ట్ర ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ విద్యార్థులకు బిల్లులు చెల్లించకుండా విద్యను దూరం చేస్తూ వివక్షత చూపుతుందని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఖమ్మం గిరిప్రసాద్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత మూడేళ్లగా ప్రభుత్వం విద్యార్థులకు అందించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో ఆయా స్కూల్ యాజమాన్యాలు ఫీజులు చెల్లించే వరకూ విద్యార్థులను పాఠశాలలకు రావొద్దని హుకుం జారీ చేశాయని, దీనితో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు మాగం లోకేష్, శివ నాయక్, గోపి, చంటి, పవన్, నరేందర్, నాగరాజు, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సర్పంచ్ రిజర్వేషన్‌పై చర్చ..



ఎస్‌వీ బంజర గ్రామ పంచాయతీ కార్యాలయం

రఘునాథపాలెం: మండల పరిధిలోని కొన్ని గ్రామ పంచాయతీల్లో బీసీ వర్గానికి ఓటర్లు లేని పరిస్థితుల్లోనూ సర్పంచ్ పదవిని బీసీలకు రిజర్వ్ చేయడం వివాదానికి దారి తీస్తోంది. తాజాగా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల కోసం కొత్త రిజర్వేషన్లు ఖరారు చేసిన నేపథ్యాన.. మండలంలోని 37 జీపీల్లో రాములుతండా, ఎస్‌వీ బంజర జీపీల్లో సర్పంచ్ పదవి బీసీలకు కేటాయించారు. అయితే ఈ గ్రామాల్లో బీసీ వర్గానికి చెందిన ఓటర్లు లేరు అనేది అధికారిక ఓటర్ల జాబితా ప్రకారం స్పష్టమవుతోంది. ఎస్‌వీ బంజర గ్రామంలో మొత్తం 312 ఓటర్లు ఉండగా, వారిలో ఎస్టీ వర్గానికి చెందినవారు 310 మంది, ఎస్సీ వర్గానికి 2 మంది మాత్రమే ఉన్నారు. అలాగే రాములుతండాలో మొత్తం 518 ఓటర్లు, అందులో ఎస్టీ వర్గానికి చెందినవారు 517 మంది, ఎస్సీ వర్గానికి ఒకరు ఉన్నారు. బీసీ ఓటర్లు లేని ఈ గ్రామాల్లో సర్పంచ్ పదవిని, ఎస్‌వీ బంజరలో బీసీ (మహిళ)లకు, రాములుతండాను బీసీ జనరల్‌కు కేటాయించడం స్థానికుల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ ఇటీవల జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ పదవులకు రిజర్వేషన్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో బీసీ ఓటర్లు లేని గ్రామాలకు రిజర్వేషన్ కేటాయించడం పట్ల గ్రామస్తులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ''ఓటర్లు లేని వర్గానికి రిజర్వేషన్ కేటాయిస్తే పోటీ ఎలా జరుగుతోంది?''అనే ప్రశ్నలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రిజర్వేషన్లలో సాంకేతికపరమైన లోపాలున్నాయా? లేక డేటా ఆధారాలు సరైనవా? అన్నదానిపై అధికారులు స్పష్టత ఇవ్వాలంటూ ప్రజలు కోరుతున్నారు.

కేఎంసీ సమాచారం..

కేఎంసీలో వాల్మీకి జయంతి



నివాళులర్పిస్తున్న కేఎంసీ కమిషనర్, సిబ్బంది

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మహాకవి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీ దుకాణాలకు జరిమానా..

టీ గ్లాసులు, వ్యర్థాలు రోడ్ల వెంట వేస్తున్న టీ దుకాణాలకు కేఎంసీ అధికారులు జరిమానా విధించారు. శానిటరీ సూపర్‌వైజర్ ఎం.సాంబయ్య ఆధ్వర్యాన శానిటేషన్ ఉద్యోగులు, సిబ్బంది రైల్వే స్టేషన్ రోడ్డులోని పలు టీ దుకాణాలకు రూ.10 వేల జరిమానా విధించారు. టీ తాగిన తర్వాత గ్లాసులు బయట పడేస్తే దుకాణ యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కేఎంసీ కమిషనర్‌కు ఆహ్వానం

ఈనెల 12న నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే లాఫ్టర్ యోగా జాతీయ సదస్సుకు కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు లాఫ్టర్ యోగా సొసైటీ చైర్మన్, తెలంగాణ యోగా సంఘ రాష్ట్ర అధ్యక్ష సేవక్ మరికంటి వెంకట్ ఆహ్వాన పత్రం అందజేశారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు కార్యక్రమం ప్రారంభమవుతుందగా.. ప్రతిఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్స్ కల్లూరు శ్రీధర్, పర్సగాని వంశీకృష్ణ, దొంతగాని అంజి పాల్గొన్నారు.

కేసులు నమోదు..

విద్యార్థి అదృశ్యంపై..

రఘునాథపాలెం: మండలంలోని పాపటపల్లి బంజరకు చెందిన 10వ తరగతి విద్యార్థి బోడ గౌతమ్ అదృశ్యంపై కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపారు. పాఠశాలకు అని వెళ్లి తిరిగిరాలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు.

వేధింపులపై..

మండలంలోని వీవీపాలెంకు చెందిన ఒక యువతిని చెరువుకొమ్ముతండాకు చెందిన సమీప బంధువు అచ్యుత్ వేధింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు మంగళవారం అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న పోటు రంగారావు

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం/ఖమ్మంమామిళ్లగూడెం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని ఎంవెంకటాయపాలెంలో జరిగిన సమావేశంలో ప్రజల సమస్యల పరిష్కారమే అజెండాగా పని చేయాలని రంగారావు, తిరుమలాయపాలెంలో గజ్జల వెంకటయ్య భవనంలో జరిగిన సమావేశంలో కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి అత్యధిక స్థానాల్లో విజయం సాధించాలని శ్రీను, ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యాన ఖమ్మం పార్టీ కార్యాలయంలో సమావేశంలో పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని రాజేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ వేర్వేరుగా తెలిపారు. పార్టీ ప్రతిష్టను కాపాడుతూ, పార్టీ జౌన్నత్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందని, పదవులపై వ్యామోహం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ముందుకు వెళితే ప్రజల మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశాల్లో నాయకులు బందెల వెంకయ్య, మలీదు నాగేశ్వరరావు, కుర్ర వెంకన్న, వీర్ల వెంకటప్పారావు, పూలమ్మ, పద్మనాభుల సుధాకర్ రావు, తుళ్లూరు నాగేశ్వరరావు, దొండేటి నిర్మల్ రావు, బింగి రమేష్, షేక్ ఖాసీం, వై.ప్రకాష్, పి.మోహన్‌రావు, షేక్ సుబహాన్, వీ.వీ.రావు, వై.జానకి, తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ రమణమూర్తి, సీఐలు

సాక్షి ఎఫెక్ట్..

ఖమ్మం అర్బన్: ఈనెల 6న నగరంలో రౌడీ షీటర్లు చేస్తున్న అల్లర్లపై 'సాక్షి'లో 'రౌడీ షీటర్ల హల్‌చల్' అనే కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనికి స్పందించిన నగర ఏసీపీ రమణమూర్తి బుధవారం ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత పద్ధతులు మార్చుకుని, మంచి నడవడికతో జీవించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు కరుణాకర్, బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కార్పొరేషన్‌లో ట్రాఫిక్‌ను నియంత్రించాలని, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఐ ఆధ్వర్యాన నగరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం మాట్లాడుతూ.. ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, రైతు బజార్ల వద్ద పార్కింగ్ స్థలాలు లేక ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, అసలు వారికి అనుమతి ఎవరు ఇస్తున్నారని, అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వారు పెట్టుకున్న సెల్లార్లు కేవలం వారి షాపుల సామన్లు కోసమే ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు. టూటౌన్ ఏరియా కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యుడు యానాలి సాంబశివారెడ్డి మాట్లాడుతూ.. కేవలం బైకులకు చలాన్లు వేయడమే గాని ట్రాఫిక్‌ను నియంత్రణపై దృష్టిపెట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జ్వాల నర్సింహారావ్, మంద వెంకటేశ్వర్లు, చానా, కుమార్, డి.శేఖర్‌నాయక్, సతీష్‌రెడ్డి, మీర, రవి, నాగ, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పోలింగ్ బూత్‌ల ఏర్పాటు

రఘునాథపాలెం: మండలంలోని గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌ల గుర్తింపు, నంబర్ల నమోదు ప్రక్రియ చురుగ్గా సాగుతోంది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో పోలింగ్ బూత్‌ల నంబర్లు ప్రజలకు తెలిసేలా గోడలపై రాస్తున్నారు. మండలంలో మొత్తం 13 ఎంపీటీసీ స్థానాలకు 81 పోలింగ్ బూత్‌లు, 37 వార్డు సభ్యుల ఎన్నికకు 308 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పనులను ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థినికి సన్మానం

తిరుమలాయపాలెం: మండలంలోని ఎదుళ్లచెరువు గ్రామానికి చెందిన ఆరెంపుల ఉపేందర్, శ్రీలత దంపతుల కుమార్తె సమీర కరీంనగర్ ప్రతిమా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. దీంతో మంగళవారం ఎదుళ్లచెరువు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు సమీరాను ఘనంగా సన్మానించగా.. గ్రామానికి చెందిన కమతం రాము సెల్‌ఫోన్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు, విద్యార్థిని తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



చెక్కు అందిస్తున్న అడిషనల్ డీసీపీ రామానుజం

ఖమ్మం సహకారనగర్/ఖమ్మంక్రైం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అడిషనల్ డీసీపీ బి.రామానుజం అన్నారు. మంగళవారం సీపీ కార్యాలయంలో పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆధ్వర్యాన ఇంజనీరింగ్ విద్యార్థి పండిట్ జయంత్‌బాబుకు రూ.20వేల చెక్కును అందించాక ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య, విశ్రాంత పోలీస్ శాఖ ఉద్యోగి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కళాకారుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వేల్పుల విజేత

ఖమ్మంగాంధీచౌక్: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జానపద నిరుపేద కళాకారుడు మోదుగు గోవింద్‌రావుకు మహిళా ప్రాంగణం జిల్లా అధికారి, ఖమ్మం కళాపరిషత్ కార్యదర్శి డాక్టర్ వేల్పుల విజేత మంగళవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల ఖమ్మంలో సాహిత్య సంస్థలు నిర్వహించిన రెండు కార్యక్రమాల్లో పాల్గొని జానపద పాటలు వినిపించి తిరిగి తన స్వగ్రామం వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురికాగ గోవింద్‌కు ఆర్థిక సాయం అందించాలని కుటుంబీకులు, కళాకారులు అభ్యర్థిస్తున్నారు.

నియామకం



గుత్తా వెంకటేశ్వరరావు

రఘునాథపాలెం: భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని చిమ్మపుడి గ్రామానికి చెందిన శ్రీ గుత్తా వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. గతంలో గ్రామ ఉపసర్పంచ్‌గా, రైతు సంఘం అధ్యక్షుడిగా పని చేసిన ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం నిరంతరం శ్రమిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం పని చేస్తానన్నారు.

సీజేఐపై దాడికి నిరసన..



ఖమ్మం మామిళ్లగూడెం: కళ్లకు గంతలు కట్టి ర్యాలీ తీస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ)పై దాడి సరైంది కాదని, దాడి యత్నం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బహిరంగ క్షమాపణ చెప్పాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యాన ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్ హాల్ నుంచి ఎన్నెస్పీ క్యాంప్ గేట్ వరకు కళ్లకు నల్లగంతలు ధరించి నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజేఐపై మత ఉగ్రవాది, న్యాయవాది రాకేష్ కిషోర్ తన బూటు విసిరి దాడికి పాల్పడటాన్ని జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని, సుప్రీంకోర్టులో జరిగిన ఈ దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయమూర్తులు ఇచ్చే తీర్పులు రాజ్యాంగానికి లోబడి కాకుండా మతం, దేవుళ్లు, సనాతన ధర్మానికి లోబడి ఉండాలని ఆర్ఎస్ఎస్, బీజేపీలు విస్తృతంగా ప్రచారం చేయడంతోనే ఇటువంటి దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, సాగర్, ఎస్‌కె.సైదులు, నరేష్, వీరభద్రం, రామనాథం, బాలు, భద్రం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి మచ్చ..

ఖమ్మంవైరారోడ్/తిరుమలాయపాలెం/ఖమ్మం మయూరిసెంటర్: సీజేఐ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి న్యాయవ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి మచ్చ తెస్తాయని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, బీఎస్పీ, మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు ఎన్నెబోయిన రమేష్, తిమ్మిడి హన్మంతరావులు మంగళవారం వేరు వేరు ప్రకటనల్లో ఖండించారు. న్యాయమూర్తిపై జరిగిన దాడిని భారత రాజ్యాంగంపై జరిగిన దాడిగానే భావించి దాడికి ప్రయత్నించిన లాయర్‌పై దేశద్రోహం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ దాడి న్యాయ చరిత్రలో చీకటి రోజని అన్నారు.